క్లుప్తంగా

నేడు మంగళగిరిలో లావణ్య ప్రచారం

మంగళగిరి: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి మురుగుడు లావణ్య శుక్రవారం మంగళగిరి పట్టణంలో ప్రచారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయ వర్గాలు తెలిపారు. ఉదయం 8 గంటలకు నాంచారమ్మ చెరువు వద్ద గల దామర్ల నాగయ్య ఇంటి వద్ద నుంచి ప్రచారాన్ని ప్రారంభిస్తారని ప్రచారంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమలలు పాల్గొంటారని, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నృసింహునికి, రాజ్యలక్ష్మి అమ్మవారికి సారె



మంగళగిరి: నగరంలో వేంచేసియున్న లక్ష్మీనృసింహస్వామి వారికి, రాజ్యలక్ష్మి అమ్మవార్లకు గురువారం సారె సమర్పించారు. పాత మంగళగిరి పద్మశాలీయ సంఘం తరఫున భావనాఋషి ఆలయం నుంచి సారెతో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమలలు నృసింహస్వామి ఆలయానికి చేరుకుని శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారికి, శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవార్లకు సమర్పించారు. కార్యక్రమంలో పద్మశాలీయ సంఘం ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన అవసరం



ఫిరంగిపురం: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని తహసీల్దార్ రాఘవేంద్రరావు అన్నారు. మండలంలోని గరుడాచలపాలెంలో ఓటుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా తహసీల్దార్ రాఘవేంద్రరావు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ తప్పని సరిగా వినియోగించుకోవాలని చెప్పారు. అనంతరం సెంటర్‌లో మానవహారంనిర్మించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఏఎస్ఓ శివకుమార్, పంచాయతీ కార్యదర్శి వెంకట్రావు, సీనియర్ అసిస్టెంట్ అబ్దుల్ రెహమాన్, వీఆర్వోలు గురువయ్య, బ్రహ్మయ్య, ధర్మతేజ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డీలర్లు ఎన్నికల నియమావళి పాటించాలి



ఫిరంగిపురం: మండలంలోని రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని తహసీల్దార్ జి.రాఘవేంద్రరావు అన్నారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు రాజకీయ పార్టీల సభలు, సమావేశాలు, ర్యాలీలు, ప్రచారాలు, పార్టీనాయకులతో కలిసి తిరగడం వంటివి చేయకూడదని చెప్పారు. అలా చేసినట్లయితే ఎన్నికల నిబంధనల ప్రకారం వారిని తొలగిస్తామన్నారు. సమావేశంలో రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్‌లో చోరీ

గుంటూరు ఈస్ట్: ప్రైవేటు హాస్టల్‌లో ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు చోరికి గురైన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బ్రాడీపేట 6/9లోని మను బాలుర హాస్టల్‌లో బుధవారం రాత్రి వెనుక తలుపులు తెరిచి నిద్రించారు. గదిలోని రెండు ల్యాప్‌టాప్‌లు, మూడు సెల్‌ఫోన్లు చోరికి గురయ్యాయి. బాధితులు అశోక్, ప్రమోద్, కిరణ్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు. కొల్లిపర మండలం అన్నవరపులంక గ్రామంలో అనధికార మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, సిబ్బంది గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తి నుంచి 14 సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

జగనన్న పథకాలతో రాష్ట్రం సుభిక్షం

- సీఎం వైఎస్ జగన్ పరిపాలనలోనే పేదలు తలెత్తుకుని తిరుగుతున్నారు
- ఏ ఇంటికి వెళ్లినా జనం బ్రహ్మరథం పడుతున్నారు
- దుగ్గిరాలలో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కిలారి రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి లావణ్యల ఇంటింటి ప్రచారం



దుగ్గిరాలలో పర్యటిస్తున్న మురుగుడు లావణ్య, కిలారి రోశయ్య, ఎమ్మెల్యే ఆర్కే, కాండ్రు కమల తదితరులు

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేపట్టిన దగ్గర నుంచి పేద ప్రజలు తలెత్తుకుని జీవిస్తున్నారని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే ఆశయాలను అమలు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మంగళగిరి నియోకవర్గ అభ్యర్థి మురుగుడు లావణ్య అన్నారు. గురువారం దుగ్గిరాల మండలం పెదకొండూరు గ్రామంలోని కనకపుట్లమ్మ అమ్మవారి దేవస్థానంలో పార్టీ గుంటూరు లోక్‌సభ అభ్యర్థి కిలారి రోశయ్య, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమలతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మురుగుడు లావణ్య, కిలారి రోశయ్యలు మాట్లాడుతూ దుగ్గిరాల మండలం పెదకొండూరు అమ్మవారి దేవస్థానంలో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి రాబోయే ఎన్నికల్లో 175కు 175 స్థానాలు సాధించి మరోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయాలని ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నామన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఏ ఇంటికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో అందిన సంక్షేమ పథకాల వల్ల ప్రజలు ఎంతో సుభిక్షంగా ఉన్నామని అంటున్నారని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనా ర్టీలకు ఎంతో ప్రాధాన్యత లభించిందని, రాజ్యాధికారంలో ఏ ప్రభుత్వంలో అవకాశం లభించని విధంగా అవకాశాలు కల్పించారని, మంగళగిరి నియోజకవర్గంలో బీసీ మహిళకు ఎమ్మెల్యే సీటు ఇచ్చారని ఆయనకు ఎస్సీ, ఎస్టీ, బీసీల మీద ఎంత గౌరవం ఉందో అర్థం చేసుకోవచ్చి, రాబోయే కాలంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు దానబోయిన వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు వడ్డేశ్వరపు రజనీకాంత్, సర్పంచ్‌లు మేదర సౌజన్య, బాణావత్ కుషీబాయి, షేక్ అజీజూన్, యార్లగడ్డ శ్రీచందన దుర్గా భవాని, ఉన్నం ఝాన్సీరాణి, షేక్ సల్మా, గంపల గంగాధరరావు, ఎంపీటీసీ సభ్యులు కూచిపూడి సురేష్, పెద్దేటి కావ్య, బాణావత్ ద్వాలిభాయ్, షేక్ సల్మా, పార్టీ నాయకులు షేక్ సుభాని, జమ్ముల లోకేష్, పిల్లి ధర్మరత్నం, పలుకూరి శామ్యూల్, యార్లగడ్డ చిన్న, షేక్ జానీ బాషా, చొక్కా కాంతారావు, ఉయ్యూరు మారుతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చిన జగనన్న

తాతిరెడ్డిపాలెంలో ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పర్యటన



స్థానికుల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

తాడికొండ: ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా, తనను ఎమ్మెల్యేగా ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే, మాజీ హోం మంత్రి మేకతోటి సుచరిత అన్నారు. తాడికొండ మండలం తాతిరెడ్డిపాలెం గ్రామంలో పర్యటించిన ఆమె తొలుత స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్థానికులు, మహిళలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించగా గ్రామస్తుల నుంచి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, జడ్పీటీసీ గుడిమెట్ల జ్యోతి, ఎంపీటీసీలు రావూరి దివ్య, వలపర్ల కల్పన, బోడపాటి సుశీల స్థానిక నాయకులు కొండా కిషోర్ రెడ్డి, నవీన్ రెడ్డి, నాగరాజు, క్వారీ సొసైటీ మాజీ అధ్యక్షుడు షేక్ ఆదిల్, మాజీ సొసైటీ డైరెక్టర్ రావూరి నరేష్ పలువురు నాయకులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

తాడికొండలో...

తాడికొండ రెడ్ల బజారులో నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే సుచరిత కుమారుడు మేకతోటి హర్షిత్ పాల్గొని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉప సర్పంచ్ ఉయ్యూరు వెంకటరెడ్డి, ఎంపీటీసీ ధూళిపాళ్ళ నాగేశ్వరరావు, మాజీ సొసైటీ చైర్మన్‌లు వంగా పోలారెడ్డి, రాచకొండ సాంబశివరావు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ

- నియోజకవర్గ ఈఆర్ఓ, జేసీ రాజకుమారి
- ఆత్మకూరు నిర్మల ఫార్మసీ కళాశాలలో తరగతి గదుల పరిశీలన



నిర్మల ఫార్మసీ కళాశాలలో గదులను పరిశీలిస్తున్న ఈఆర్ఓ, జేసీ రాజకుమారి

మంగళగిరి: నియోజకవర్గంలో ఎన్నికల విధులకు నియమితులైన సిబ్బందికి శిక్షణ కార్యక్రమం ఉంటుందని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి తెలిపారు. శిక్షణకు నగర పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి పక్కన గల నిర్మల ఫార్మసీ కళాశాలలో ఏర్పాటు చేసిన రూంలను గురువారం పరిశీలించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు అవసరమైన మౌలిక వసతులు, తరగతి గదులలో ఫర్నీచర్, భోజన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకునేందుకు ఏర్పాట్లను పరిశీలించారు. ఈవీఎం భద్రపరిచే గదులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈఆర్ఓ ఎన్.ప్రకాశరావు, తహసీల్దార్ కె.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న పథకాలు స్వచ్ఛందంగా ప్రచారం

అడ్డుగా ఉన్నందునే వలంటీర్ ఉద్యోగానికి రాజీనామా



పెరుకలపూడి కార్యదర్శి సుల్తానాకు రాజీనామా పత్రంఅందజేస్తున్న వలంటీర్ గంపల వెంకటలక్ష్మి

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి పేదప్రజలు ఎంతో సుఖ సంతోషాలతో ఉన్నారని, ఆయన గెలుపునకు తాను సైతం ప్రచారం చేసేందుకు వలంటీర్ ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు దుగ్గిరాల మండలం, పెరుకల పూడి గ్రామానికి చెందిన గంపల వెంకట లక్ష్మి గురువారం తన రాజీనామా పత్రాన్ని పంచాయతీ కార్యదర్శి నసరత్ సుల్తానాకు అందజేసింది. ఈ సందర్భంగా వలంటీర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసేందుకు తనవంతు స్వచ్ఛందంగా ప్రచారం చేయాలని నిర్ణయించుకుని వలంటీర్ ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యవసాయ కూలీ మృతి



మృతి చెందిన మోర్ల వెంకటేశ్వరరావు

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని మెల్లెంపూడిలో తాడిచెట్టు ఎక్కి తాటాకులు కొడుతున్న ఒక వ్యవసాయ కూలీ పొరపాటు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందిన సంఘటనపై తాడేపల్లి పోలీసులు గురువారం కేసు నమోదుచేశారు. ఎస్ఐ ప్రతాప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఇప్పటం గ్రామానికి చెందిన మోర్ల వెంకటేశ్వరరావు (45) కూలి పనులు చేసుకుంటూ భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లల్ని పోషిస్తూ జీవనం సాగిస్తున్నాడు. మెల్లెంపూడిలో తాటాకులు నరికే పని ఉండడంతో ఉదయం 10 గంటలకు పనికి వెళ్లాడు. అరగంట తరువాత తండ్రి రామారావుకు వెంకటేశ్వరరావు చెట్టుమీద నుంచి పడి గాయాలు అయ్యాయని చెప్పడంతో తండ్రి సంఘటనా స్థలానికి వెళ్లాడని, అప్పటికే కుమారుడు వెంకటేశ్వరరావు చనిపోయి ఉన్నాడన్నారు. తాడిచెట్టు ఎక్కిన వెంకటేశ్వరరావు కరెంటు తీగలకు ఆనుకుని ఉన్న తాటాకులను కర్రతో తప్పించే ప్రయత్నం చేస్తుండగా చెట్టుకు కరెంటు సరఫరా అయ్యి ఈ ప్రమాదం జరిగిందని తండ్రి రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రతాప్ కుమార్ తెలిపారు.

బార్ అసోషియేషన్ అధ్యక్షుడిగా బాల మురళీకృష్ణ



నూతనంగా ఎన్నికైన అసోషియేషన్ ప్రతినిధులను అభినందిస్తున్న న్యాయవాదులు

మంగళగిరి: మంగళగిరి బార్ అసోషియేషన్ అధ్యక్షుడిగా శృంగారపాటి బాల మురళీకృష్ణ ఎన్నికయ్యారు. గురువారం కోర్టు ఆవరణలోని బార్ అసోషియేషన్ కార్యాలయంలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా బాల మురళీకృష్ణ తమ ప్రత్యర్థి వేమూరి రత్నప్రసాద్‌పై ఏడు ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఉపాధ్యక్షుడుగా కుడారి శేఖర్‌బాబు తమ ప్రత్యర్థి తోట నరసింహారావుపై మూడు ఓట్ల తేడాతో గెలుపొందారు. ప్రధాన కార్యదర్శులుగా మాలపాటి సురేంద్రబాబు, రెంటపల్లి రాజేష్‌లు పోటీపడగా ఇద్దరికీ సమాన ఓట్లు రావడంతో చెరో ఆరునెలలు పదవిని పంచుకునేందుకు అంగీకరించారు. కార్యదర్శిగా తాతా సాంబశివరావు, కోశాధికారిగా సూరబోయిన మురళీకృష్ణ, మహిళా కార్యదర్శిగా వింజమూరి భారతీదేవి, లైబ్రరీ కార్యదర్శిగా స్వరూపారాణి, స్పోర్ట్స్, కల్చరల్ కార్యదర్శిగా గుర్రం రామారావులు ఎన్నికవగా మరో 15 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు వాకా రామ్‌గోపాల్ గౌడ్, గుజ్జర్లపూడి జాన్‌బాబు, కె.అంబేడ్కర్, ఎండీ షౌకత్ హుస్సేన్, జొన్నాదుల లెనిన్‌బాబులు పాల్గొనగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని పలువురు న్యాయవాదులు అభినందించారు. ఎన్నికల అధికారులుగా కూర్మాల దుర్గాప్రసాద్, తలశిల మధుసూదనరావు, ఆరెగకూటి రామ్మోహన్‌రెడ్డిలు వ్యవహరించగా బార్ ప్రధాన కార్యదర్శి బేతపూడి నాయుడమ్మ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

డిపాజిట్లపై అత్యధిక వడ్డీ

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు చైర్మన్ టి.కామేశ్వరరావు



113 త్యాళ్లూరులో బ్యాంకు బ్రాంచిని ప్రారంభిస్తున్న చైర్మన్ టి.కామేశ్వరరావు

ఫిరంగిపురం: డిపాజిట్లపై అత్యధిక వడ్డీశాతం ఇస్తున్న ఏకై క ప్రభుత్వరంగ సంస్థ చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు అని చైర్మన్ టి.కామేశ్వరరావు అన్నారు. మండలంలోని 113 త్యాళ్లూరు గ్రామంలో నరసరావుపేట రీజియన్‌లో 68వశాఖను గురువారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రుణసదుపాయం కల్పిస్తామని చెప్పారు. ఎనిమిది జిల్లాల్లో బ్రాంచీలు ఉండగా, ఇక్కడిది 264 బ్రాంచి అని అన్నారు. డిపాజిట్లపై జనరల్ సిటిజన్స్‌కు 8.10శాతం, సీనియర్ సిటిజన్స్‌కు 8.60శాతం వడ్డీ కల్పిస్తున్నట్లు తెలిపారు. అంతేకాక ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఆకర్షణీయమైన వడ్డీ కల్పిస్తున్నట్లు చెప్పారు. రైతులకు క్రాప్ లోన్లు, ఇంటి రుణాలు, విద్యార్థుల చదువులకు రుణాలు అందజేస్తామని తెలిపారు. సంస్థ అభివృద్ధికి సహకరించాలనికోరారు. అనంతరం రైతులతో మాట్లాడారు. జనరల్ మేనేజర్ బీవీ రమణరావు, ఆర్ఎం సీహెచ్ శ్రీనివాసరావు, బ్రాంచి మేనేజర్ దుర్గాప్రసాద్, క్యాషియర్ ఎన్.నరసింహారావు, రైతులు పాల్గొన్నారు.

బైపాస్‌రోడ్డులో ఆకస్మిక తనిఖీలు



వాహనాలను తనిఖీని పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, ఎస్పీ తుషార్

తాడేపల్లిరూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 16వ జాతీయ రహదారి వెంబడి కనకదుర్గ వారధి వద్ద పోలీస్ చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్ట్ వద్ద గురువారం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, ఎస్పీ తుషార్‌లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వేణుగోపాల రెడ్డి మాట్లాడుతూ పార్టీలకు, వ్యక్తులకు అతీతంగా పోలీస్‌శాఖ వారు పలు ప్రాంతాల్లో చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నారని, ఈ తనిఖీలకు రాజకీయ పార్టీ నేతలు, ప్రజలు, వ్యాపారులు సహకరించాలని, సరైన పత్రాలు లేకుండా రూ.50 వేలు మించి నగదు తీసుకు వెళితే, ఆ నగదును సీజ్ చేస్తామని, అలాగే సరైన పత్రాలు లేకుండా ఓటర్లను ప్రభావితం చేసేందుకు వివిధ రకాల వస్తువులను తరలించే అవకాశం ఉందని, వాటిని సైతం సీజ్ చేస్తామని ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో నార్త్ జోన్ డీఎస్పీ రవికాంత్, తాడేపల్లి సీఐ కళ్యాణ్ రామ్, ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇప్పటంలో తాగునీటి బోర్లు ఏర్పాటు



తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి రూరల్ ఇప్పటంలో కార్పొరేషన్ అధికారులు రానున్న వేసవిలో నీటి ఎద్దడిని నివారించేందుకు గురువారం నూతన బోరు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా డీఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ గతంలో ఇప్పటం పంప్‌హౌస్‌లో ఉన్న తాగునీటి బోరులో భూగర్భ జలాలు తగ్గడంతో తాగునీరు సరఫరా కావడం లేదని ఆ బోరుస్థానంలో మరో రెండు కొత్తబోర్లను కమిషర్ నిర్మల్ కుమార్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేస్తున్నామని, రెండు మూడు రోజుల్లో తాగునీటి ఎద్దడి లేకుండా పరిష్కరించనున్నట్లు ఆయన తెలిపారు.

రేపు గోపాత్రుడు నవలపై చర్చావేదిక

తెనాలి: పత్రికా సంపాదకురాలు ఆహ్వానం లక్ష్మి సంస్మరణలో పట్టణానికి చెందిన సాహితీ సాంస్కృతిక వేదిక భిన్నస్వరాలు ఆధ్వర్యంలో నెలనెలా ఏర్పాటు చేస్తున్న చర్చావేదికను ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్నారు. ఆరోజు సాయంత్రం ఆరు గంటలకు కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఏర్పాటయ్యే సభలో సుప్రసిద్ధ రచయిత, పాత్రికేయుడు కేఏన్వై పతంజలి నవల 'గోపాత్రుడు'పై చర్చ ఉంటుందని నిర్వాహకులు తెలియజేశారు.

రేపు 'రన్ ఫర్ జీసస్'

నెహ్రూనగర్: క్రీస్తు పునరుత్థాన దినాన్ని పురస్కరించుకొని మానవాళి శాంతి సుఖ సంతోషాలతో మనుగడ సాగించాలనే ఉద్దేశంతో శనివారం ఉదయం 5 నుంచి 9 గంటల వరకు రన్ ఫర్ జీసస్ కార్యక్రమం గుంటూరు నగరంలో నిర్వహించనున్నట్లు రన్ ఫర్ జీసస్ కో–ఆర్డినేటర్ సెయింట్ మాథ్యూస్ వెస్ట్ పారిస్ పాస్టర్ రెవరెండ్ జి.సతీష్ బాబు తెలిపారు. గురువారం గుంటూరులోని వెస్ట్ పారిష్ చర్చి ప్రాంగణంలో విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. క్రైస్తవ సంఘాల మధ్య ఐక్యత, యువత సమన్వయం, ప్రజల సమభావం పెంపొందించాలనే లక్ష్యంతో క్రీస్తు పునరుత్థానం పురస్కరించుకొని హిందూ కాలేజ్ కూడలి వద్ద ఉన్న వెస్ట్ పారిస్ చర్చి నుంచి రన్ ఫర్ జీసస్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. నగరంపాలెం, కలెక్టరేట్, కంకరగుంట ఫ్లైఓవర్, ఎన్టీఆర్ స్టేడియం, లక్ష్మీపురం, లాడ్జి సెంటరు, నార్త్ పారిష్, చర్చి దగ్గర రన్ ముగుస్తుందని వెల్లడించారు.నగరంలోని అన్ని క్రైస్తవ సంఘాలు, సంస్థలు, సంఘస్తులు, విశ్వాసులు వేలాదిగా తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఏఈఎల్‌సీ సినడ్ బిషప్ రైట్ రెవరెండ్ ఎస్‌జే బాబురావు, బొలెద్దు మాథ్యూస్, కె.నిరంజన్, బెంజిమెన్ ఫ్రాంక్లిన్, నెల్సన్, జాన్ పాల్గొన్నారు.

గ్రామాల్లో అలజడులు సృష్టిస్తే సహించేది లేదు

తెనాలిరూరల్: గ్రామాల్లో అలజడులు రేపితే సహించేది లేదని, కఠినంగా వ్యవహరిస్తామని రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు హెచ్చరించారు. తెనాలి రూరల్ పోలీసులు, సీఐఎస్ఎఫ్ బలగాలు గురువారం మండలంలోని జాకీర్ హుస్సేన్‌నగర్, హాఫ్‌పేట, ఖాజీపేట, ఎరుకలపూడి గ్రామాల్లో రూట్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలన్నారు. అసాంఘిక శక్తులను గుర్తించి కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ ధైర్యంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలు ఎలాంటి భయాందోళనకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు భద్రత మీ వెంటే ఉంటుందన్న నమ్మకాన్ని ప్రజల్లో కల్పించేందుకు అన్ని ప్రాంతాల్లో రూట్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మెడికల్ క్యాంప్‌లతో ఆరోగ్య భరోసా



తెనాలిఅర్బన్: ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌లు పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నాయని అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బీబీ జాన్ పేర్కొన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని పాత ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో గురువారం సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గైనిక్ ఓపీ 14, జనరల్ ఓపీ 171, ఆర్థోపెడిక్ 51, ఆప్తామాలజీ 45 మందికి వైద్య సేవలు అందించినట్లు చెప్పారు. మెడికల్ క్యాంప్ సేవలను అందరూ ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సౌమ్య, డాక్టర్ వినోద్ బాబు, డాక్టర్ మధుకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ కాంతుల్లో మసీదు



విద్యుత్ కాంతులతో కళకళలాడుతున్న పాతబస్టాండ్ సెంటర్‌లోని మసీదు

మంగళగిరి: రంజాన్ మాసం సందర్భంగా నగరంలోని మసీదులు విద్యుత్ కాంతులలో మిరుమిట్లు గొల్పుతున్నాయి. నగరంలో ఆయా మసీదులను ముస్లింలు, మసీదు కమిటీల ప్రతినిధులు ప్రత్యేకంగా అలంకరణలు చేసి విద్యుత్‌దీపాలతో అలంకరించడంతో ఆయా మసీదులు రంజాన్ శోభతో కళకళలాడుతున్నాయి.